మహిళలు అన్నింటా రాణించాలి

- మహిళా దినోత్సవంలో ప్రజాప్రతినిధుల వెల్లడి
- మహిళకు ముగ్గుల పోటీల నిర్వహణ
- ప్రతిభ చూపిన వారికి బహుమతుల పంపిణీ


బాన్సువాడలో మహిళలు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న ఎంపీపీ నీరజ


సదాశివనగర్‌లో మాట్లాడుతున్న జెడ్పీటీసీ

దోమకొండ: పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జెడ్పీటీసీ సభ్యుడు తీగల తిర్మల్‌గౌడ్ పేర్కొన్నారు. 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్, సఖీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎంపీపీ కానుగంటి శారద, సర్పంచ్ నల్లపు అంజలి, తహసీల్దార్ కౌషిక, ఎంపీడీవో చిన్నారెడ్డి, ఏఎస్‌ఐ సుబ్రమణ్యచారి, ఏపీఎం రాజు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాన్సువాడ టౌన్: మహిళ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక మినీ స్టేడియంలో అంగన్‌వాడి టీచర్లకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి ఎంపీపీ నీరజావెంకట్‌రాంరెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. మండలానికి చెందిన పలువురు అంగన్‌వాడి టీచర్లు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పద్మ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్: ఆడపిల్ల పుట్టగానే భారంగా బావించొద్దని జెడ్పీటీసీ కమిలి నర్సింలు పేర్కొన్నారు. స్థానిక రైతు వేదిక భవనంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పురుషులతో సమానంగా ఆడ పిల్లను కూడా ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అనసూయ, సర్పంచ్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ వంకాయల రవి, ఎంపీటీసీ బీరయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్, పెసరి సాయిలు, రమేశ్, ఐసీడీఎస్ సీడీపీవో శ్రీలత, అంగన్‌వాడీ టీచర్లు సిరిసిల్ల సునంద, గంగమణి, వసంతరాణి, లక్ష్మి, కొప్పుల సునంద పాల్గొన్నారు.

మద్నూర్ :మహిళల్లో చైతన్యం వస్తే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని మద్నూర్‌లో నిర్వహించిన సమావేశంలో సీడీపీవో సునంద పేర్కొన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని నాలుగు మండలాల్లో పని చేస్తున్న అంగన్‌వాడి టీచర్లకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సంగీత తదతరులు పాల్గొన్నారు.


మద్నూర్‌లో మాట్లాడుతున్న సీడీపీవో సునంద


దోమకొండలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ

ప్రశ్నిస్తే కేసులు నమోదు చేస్తారా?

కామారెడ్డి అర్బన్: అన్యాయాన్ని ప్రశ్నించే వారి గొంతును అధికార పార్టీ నాయకులు పోలీసు ప్రయోగంతో అడ్డుకోవడం అన్యాయం అని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బి.బాల్‌రాజు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భిక్కనూర్‌కు చెందిన బీఎస్పీ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి శ్రీధర్‌రెడ్డి ఇంటి వద్ద ప్రహరీగోడ విషయంలో జరిగిన పెనుగులాటలో సత్యంరెడ్డి అనే వ్యక్తికి గాయాలు అయ్యాయని తెలిపారు. ఇదే అదనుగా భావించి అధికార పార్టీ నేతల ఒత్తిడితో పోలీసులు శ్రీధర్‌రెడ్డితో పాటు ఆయన సోదరుడు జ్ఞానప్రకాష్‌రెడ్డిలపై 307 తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేసి జైలుకు పంపడం అన్యాయం అన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజు, నాయకులు టి.స్వామి, తుకారామ్, కె.రాజు, బి.రాజలింగం, బి.భాస్కర్, హరిలాల్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు

జూన్‌లోగా పనులు పూర్తి చేయాలి


మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ రూరల్: మంజూరైన వివిధ అభివృద్ధి పనులు జూన్‌లోగా పూర్తి చేయాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం తన నివాసంలో మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. కమ్యూనిటీ భవనాలు, పాఠశాల అదనపు గదులు, అంగన్‌వాడి కేంద్రాలు, సీసీరోడ్లు, డ్రైనేజీలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌నాయక్, అంజిరెడ్డి, పిట్ల శ్రీధర్, గంగుల గంగారాం, గోపాల్‌రెడ్డి, మాలెపు నారాయణరెడ్డి, రాజేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్లతో గ్రామాలకు మహర్దశ


వడ్లంలో పనులను ప్రారంభిస్తున్న ఎంపీడీవో


మద్నూర్‌లో పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

సాక్షి, నెట్‌వర్క్: సిమెంట్ రోడ్లతో గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ వస్తోందని పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ఎల్లారెడ్డి మండలం అల్మాజీపూర్‌లో ఎంపీపీ మాధవి, సర్పంచ్ మాధవి, జెడ్పీటీసీ ఉషాగౌడ్, వైస్ ఎంపీపీ నర్సింలు సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. సదాశివనగర్ మండలం ఉత్తనూరులో ఎంపీపీ గైని అనసూయ, జెడ్పీటీసీ కమిలి నర్సింలు, సర్పంచ్ మోతె సాయవ్వ రాములు, మద్నూర్ మండల కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో సర్పంచ్ దరాస్‌వార్ సురేష్, ఎంపీటీసీ సంగీత కుషాల్, మండల కేంద్రమైన నాగిరెడ్డిపేటలో సర్పంచ్ సునీతరెడ్డి, మండల కేంద్రమైన భిక్కనూరు, తిప్పాపూర్‌లో ఎంపీపీ గాలిరెడ్డి, వైస్ ఎంపీపీ యాదగిరి, ఆత్మకమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, సర్పంచ్‌లు తున్కి వేణు తదితరులు సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. అదేవిధంగా పెద్దకొడప్‌గల్ మండలం వడ్లంలో డ్రైనేజి నిర్మాణ పనులను ఎంపీడీవో రాణి, ఎంపీవో సూర్యకాంత్, ఉపసర్పంచ్ పండరి తదితరులు ప్రారంభించారు.

కేంద్ర పథకాలు వివరించండి


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని మండల బీజేపీ అధ్యక్షుడు ఎస్ఎన్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. శనివారం మండలంలోని మీసానిపల్లిలో నిర్వహించిన ఆ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ విజయం కోసం కష్టపడి పని చేయాలని కోరారు. అనంతరం గ్రామ బూత్ కమిటీ అధ్యక్షుడిగా అంద్యాల నగేష్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సాయిలు, విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం

కామారెడ్డి టౌన్: విలువలతో కూడిన విద్య ఎంతో అవసరం అని పలువురు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతి విద్యామందిర్ హైస్కూల్ 39వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వ్యాపారవేత్త తిమ్మయ్యగారి సుభాష్ రెడ్డి, సినీ గాయకుడు అనురాగ్ కులకర్ణి, శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి, సామాజిక సమరసత తెలంగాణ అధ్యక్షుడు అప్పాల ప్రసాద్, డీఈవో రాజు, మున్సిపల్ చైర్ పర్సన్ నిట్టు జాహ్నవి, వైస్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ పాల్గొని మాట్లాడారు. హాజరయ్యారు. కార్యక్రమంలో సరస్వతి విద్యాపీఠం పూర్వ విద్యార్థి పరిషత్ అధ్యక్షుడు హరిస్మరణ్‌రెడ్డి, పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ శ్యాంసుందర్, ఉపాధ్యక్షులు అశోక్ రావు, కార్యదర్శి అర్కల మల్లేష్ యాదవ్, ప్రతాప్ గౌడ్, రంజిత్ మోహన్, బొడ్డు శంకర్, గీరెడ్డి రాజిరెడ్డి, ప్రిన్సిపల్ నాగభూషణం పాల్గొన్నారు.


సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు

ఘనంగా రైతు దినోత్సవం


జెండాను ఆవిష్కరిస్తున్న బీకేఎస్ అధ్యక్షుడు

సదాశివనగర్: మండల కేంద్రంలో శనివారం భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) ఆధ్వర్యంలో రైతు దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీకేఎస్ అధ్యక్షుడు కొప్పుల నర్సారెడ్డి బీకేఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు ఏనుగు లక్ష్మారెడ్డి, విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

నాగిరెడ్డిపేట: ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య మరింత పెంచాలని ఎంపీడీవో రఘు సూచించారు. బొల్లారంలో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించారు.

పూజారులపై చర్యలు తీసుకోవాలి

భిక్కనూరు: శ్రీసిద్ధరామేశ్వరాలయంలో సమయపాలన పాటించని పూజారులపై చర్యలు తీసుకోవాలని మండల కేంద్రానికి చెందిన గౌరిశెట్టి శివ కుమార్‌తో పాటు మరికొందరు ఆలయ ఈవో శ్రీధర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

గ్రామ సంఘాల ఆడిట్

భిక్కనూరు: మండల కేంద్రంలోని మహిళ సమాఖ్య భవనంలో గ్రామ సంఘాల ఆదాయ, వ్యయాలకు సంబంధించి అంతర్గత ఆడిట్ నిర్వహించారు. డీపీఎం సుధాకర్, ఏపీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న తాపీమేస్త్రీ

బాన్సువాడ రూరల్: బాన్సువాడ పట్టణంలోని భారత్‌గార్డెన్ సమీపంలో రామ్‌సునీల్ అనే తాపీమేస్త్రీకి దొరికిన సెల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించాడు. సెల్‌ఫోన్ బాన్సువాడకు చెందిన అమృత్‌కు చెందినదిగా గుర్తించి పోలీసులు ఆయనకు అందజేశారు. నిజాయితీ చాటుకున్న రామ్‌సునీల్‌ను సీఐ మహేందర్‌రెడ్డి అభినందించారు.

ఉద్యమకారుడికి గుర్తింపు

కామారెడ్డి అర్బన్: రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్‌గా తారిఖ్ అన్సారీని నియమించడం పట్ల ఉద్యమ కారుడికి గుర్తింపు లభించిందని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు.

బోరుబావి తవ్వకం

నస్రుల్లాబాద్: మండలంలోని నెమ్లి గ్రామంలోని బస్టాండ్‌లోని ప్రయాణికులు వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం బోరు బావి తవ్వించినట్లు ఎంపీపీ పాల్త్య విఠల్ పేర్కొన్నారు.

భవన నిర్మాణానికి భూమి పూజ

బిచ్కుంద: మండలంలోని గోపన్‌పల్లి, మెక్కా గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణానికి శనివారం ఎంపీపీ అశోక్ పటేల్ భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వంద శాతం పన్ను చెల్లించి జీపీ ఆదర్శంగా నిలవాలని కోరారు. సర్పంచులు శ్రీనివాస్, నవాజ్, ఏఎంసీ చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్, రాజు, వెంకట్‌రావు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

రాజంపేట: చిన్నారులు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, నేరాలపై మండలంలోని కొండాపూర్ ఐకేపీ భవనంలో శనివారం మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సింధుశ్రీ, ఏఎన్ఎం సావిత్రి, ఐకేపీ సీసీ భాగయ్య తదితరులు పాల్గొన్నారు.

హోలీ సంబరాలు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వృక్షశాస్త్ర, అటవీశాస్త్ర విద్యార్థులు శనివారం ప్రకృతి సిద్ధమైన చెట్లు, ఆకులు, పూలతో తయారు చేసిన రంగులతో హోలీ సంబరాలు చేసుకున్నారు. గోగుపూలు, బొగ్గు, పసుపు, పాలకూర, గులాబీపూలు, బీట్‌రూట్, వేప, మక్కపిండి మిశ్రమంతో తయారు చేసిన వివిధ రంగులను కళాశాలలో ప్రదర్శించి అనంతరం హోలీ వేడుకలు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ చంద్రకాంత్ మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ హిత రంగులను తయారు చేయడం సంతోషం అన్నారు. వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు కృష్ణమోహన్, శ్రీలత, స్వాతి, శ్రీలత, శంకర్, శ్రీవేణి, వినోద్‌కుమార్, ఎన్‌సీసీ ఎం.రామస్వామి పాల్గొన్నారు.



అనుమతిలేని నిర్మాణాలు తొలగించండి

నాగిరెడ్డిపేట: మండల కేంద్రం గోపాల్‌పేటలో అనుమతుల్లేకుండా చేపట్టిన నిర్మాణాలను వెంటనే తొలగించాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి జాతీయ రహదారి పక్కన గ్రామ పంచాయతీ స్థలాన్ని కబ్జాచేసి షెడ్డును నిర్మిస్తున్నాడని 6వ వార్డు సభ్యుడు మంత్రి అంజయ్య జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో డీఎల్‌పీవో సురేందర్ శనివారం గోపాల్‌పేటలో విచారణ చేపట్టి రికార్డులు, మ్యాపులను పరిశీలించారు. సర్పంచ్ వంజరి సునీతతో కలిసి స్థలాన్ని పరిశీలించేందుకు వెళ్లగా ఆరోపణలు ఎదుర్కొంటున్న షాహెద్‌పాషతో పాటు అతని కుటుంబ సభ్యులు విచారణకు సహకరించక పోగా సర్పంచ్‌ను తన ఎదుటే దుర్భాషలాడారని డీఎల్‌పీవో తెలిపారు. ఈ విషయమై కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు వెల్లడించారు. బెజుగంచెరువు తండా సర్పంచ్, ఉప సర్పంచ్ నిధులు దుర్వినియోగం చేశారని ఫిర్యాదులు అందడంతో డీఎల్‌పీవో సురేందర్ విచారణ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, బెజుగంచెరువు తండా సర్పంచ్ మంగ్లీ, ఉప సర్పంచ్‌లు దుర్గేష్, గోప్యా, పంచాయతీ కార్యదర్శులు భూమేశ్వర్, అనిత తదితరులు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో సురేందర్

గిరిజనులపై దాడులను అరికట్టాలి

కామారెడ్డి టౌన్: గిరిజనులపై జరుగుతున్న భౌతిక దాడులను అరికట్టాలని గిరిజన సంఘాల నాయకులు శనివారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గిరిజన కులానికి చెందిన సబ్ రిజిస్ట్రార్‌పై బీఆర్ఎస్, రియల్ ఎస్టేట్ వ్యాపారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఇటీవల పలుచోట్ల గిరిజనులపై భౌతిక దాడులు జరుగుతున్నాయని తెలిపారు. గిరిజన సంఘాల నాయకులు వెంకట్‌రాథోడ్, మోతిరాంనాయక్, లస్కర్‌నాయక్, ఆనంద్‌రావు, పూల్‌సింగ్, వినోద్‌నాయక్, మదన్‌లాల్, రవినాయక్, సర్దార్, బద్రి, శంకర్‌నాయక్, దేవిసింగ్ తదితరులు ఉన్నారు.


ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న గిరిజన నాయకులు

శనగ బస్తాలు తరలించాలని ఆందోళన


ఖండెబల్లూర్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన శనగ బస్తాల తరలింపుకు లారీలు రావడం లేదని పేర్కొంటూ శనివారం ఖండెబల్లూర్ వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. ఖండెబల్లూర్ వద్ద ఏర్పాటు చేసిన శనగ కొనుగోలు కేంద్రంలో 3,200 బస్తాల శనగ కొనుగోలు చేసి వారం రోజులైనా వాటిని తరలించడంలో జాప్యం చేస్తున్నారు. జుక్కల్ నుంచి శనగ బస్తాల లోడుతో వస్తున్న లారీని రైతులు అడ్డగించారు. విషయం తెలుసుకున్న సొసైటీ నిర్వాహకులు ఖండెబల్లూర్ సెంటర్ నుంచి శనగ బస్తాల తరలింపుకు లారీలను తీసుకు వస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మంజీరా నుంచి ఇసుకను తరలించలేదు



మంజీరా వాగును పరిశీలిస్తున్న అధికారులు

మద్నూర్: డోంగ్లీ మండలంలోని కుర్లా గ్రామ శివారులో ఉన్న మంజీర వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక రవాణా జరగలేదని మైన్స్ ఆర్ఐ నాగరాజు పేర్కొన్నారు. అనుమతుల్లేకుండా కొందరు ఇసుక రవాణా చేస్తున్నట్లు కుర్లా గ్రామానికి చెందిన పలువురు గత నెల 27న కామారెడ్డికి వెళ్లి స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నిత్యం 500 లారీల్లో ఓవర్ లోడ్‌తో ఇసుకను తరలిస్తున్నట్లు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు మైన్స్ ఆర్ఐ నాగరాజు శనివారం తనిఖీ చేశారు. ఇసుక రవాణా జరగలేదని గుర్తించినట్లు ఆయన వెల్లడించారు.

రుణాలు చెల్లించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ నర్సింహారెడ్డి

నిజాంసాగర్: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా తీసుకున్న దీర్ఘకాలిక రుణాలను చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని అచ్చంపేట సొసైటి చైర్మన్ కయ్యం నర్సింహారెడ్డి రైతులకు సూచించారు. శనివారం స్థానిక సొసైటీ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్ల ద్వారా వచ్చే కమిషన్ డబ్బులతో పాటు విత్తనాలు, ఎరువుల విక్రయాల వల్ల సొసైటీ అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తోందన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ శ్రీనివాస్, సీఈవో సంగమేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పొంచి ఉన్న ప్రమాదం

నిజాంసాగర్: ఎల్లారెడ్డి-నిజాంసాగర్ ప్రధాన రహదారిలో ఉన్న నిజాంసాగర్ ప్రధాన కాలువ వంతెన ప్రమాదకరంగా మారింది. కాలువ వంతెనకు ఉన్న రక్షణ గోడ కూలి పోవడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన కాలువలో నీటి ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. అధికారులు స్పందించి వెంటనే వంతెనకు రక్షణ గోడ నిర్మించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

బీఆర్ఎస్‌లో చేరిక



మద్నూర్: సహకార సంఘం మాజీ చైర్మన్ పాకల్‌వార్ విజయ్‌కుమార్, నాగేశ్‌పటేల్ శనివారం ఎమ్మెల్యే హన్మంత్ సింధే సమక్షంలో తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. కొన్ని కారణాల వల్ల కొంతకాలం కిందట వారిపై సస్పెన్షన్ వేటు వేసిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలని ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే సూచించారు.

డబుల్ ఇళ్ల కోసం 1,452 దరఖాస్తులు

ఎల్లారెడ్డి: డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం మున్సిపాలిటీ పరిధిలో 1,452 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఆర్డీవో శ్రీనునాయక్ వెల్లడించారు. దరఖాస్తుల స్వీకరణకు శనివారంతో గడువు ముగిసిందని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి దరఖాస్తులను పరిశీలించనున్నట్లు వెల్లడించారు.

ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని అన్నాసాగర్ గ్రామంలో సర్పంచ్ నాగరాజు శనివారం డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. 15 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ కృష్ణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ



పెద్దకొడప్‌గల్: మండల ఎస్సైగా కోనారెడ్డి శుక్రవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



మద్నూర్: మండల కేంద్రం సమీపంలోని సోమలింగాల గుట్ట ఆవరణలో శనివారం ప్రీమియర్ లీగ్ క్రికెట్ మ్యాచ్‌ను ఎస్సై కృష్ణారెడ్డి ప్రారంభించారు. క్రికెట్ టీం సభ్యులను పరిచయం చేసుకొని అనంతరం కొద్ది సేపు ఎస్సై క్రికెట్ ఆడారు. క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేష్, ఉప సర్పంచ్ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడు భూమాగౌడ్‌కు నివాళి

బాన్సువాడ రూరల్: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు ఆవరణలో శనివారం సీపీఐ ఆధ్వర్యంలో కామ్రేడ్ బొజ్జా భూమాగౌడ్ రెండవ వర్థంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీపీఐ బాన్సువాడ నియోజకవర్గం ఇంచార్జి దుబాస్‌రాములు పూలమాల వేసి నివాళులర్పించారు. పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం పరితపించే భూమాగౌడ్ ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు భూమయ్య, సాయిలు, ధర్మం, హన్మాండ్లు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలోని గిరిజన, సాంఘిక, వెనుకబడిన, ఇతర కులాల గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు సోమవారం వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు గిరిజన గురుకుల విద్యాలయాల సంస్థ మెదక్ రీజనల్ కో ఆర్డినేటర్ టి.సంపత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్

నిజాంసాగర్: వందశాతం పన్నుల వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నాగేశ్వర్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు నర్వ, శేర్‌ఖాన్‌పల్లి గ్రామాల్లో ఇంటి పన్నుల వసూలు కోసం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం చేపట్టారు. పంచాయతీ కార్యదర్శులు గంగారాం, రాజు, కవిత, ప్రసాద్, సాయి ప్రణీత్ రెడ్డి, గోపాల్ ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల రాగి తీగలు ఎత్తుకెళ్లే ముఠాతో జాగ్రత్త

బిచ్కుంద: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి రాగి తీగలు ఎత్తుకెళ్లే ముఠాలు సంచరిస్తున్నాయని అందుకు రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శ్రీధర్‌రెడ్డి సూచించారు. కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లు గుర్తిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు.

సాక్షి
దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కామారెడ్డి & ఎల్లారెడ్డి
96034 62494
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
యం. మధుసూదన్ (ACO) : 9951027699
ఎల్లారెడ్డి: డి.యల్.ఎన్. గౌడ్ : 9573130288
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899